సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 27 | జూలై | 2024



టీడీపీ దాష్టీకానికి వైఎస్సార్ సీపీ నేత బలి

8లో


టీడీపీ దాష్టీకానికి పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఒక చురుకైన నాయకుడిని కోల్పోయింది.



రూ.2 లక్షల విరాళం

హనుమాన్ జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానానికి వేళ్లపాలెం సాయి నిఖిల్‌రెడ్డి (రాజమహేంద్రవరం) శుక్రవారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 5,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

గాజుల గౌరీ దేవిగా శ్రీదేవి అమ్మవారు

20 వేల గాజులతో అలంకరణ



భక్తులకు దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారు గాజుల గౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని గాజులతో ఆలయ ఉత్సవ కమిటీ అలంకృతం చేసింది. 20 వేల గాజులతో అమ్మవారిని అలంకరించారు. ముఖ్యంగా స్త్రీలు సౌభాగ్యంగా భావించే గాజులతో అమ్మవారిని అలంకరించడంతో అమ్మవారిని వేలాది మంది మహిళా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు అమ్మవారిని గాజులతో విశేష అలంకరణ చేశారు. మహిళలే కాకుండా పట్టణంలోని వ్యాపారులు కూడా అమ్మవారిని దర్శించుకుని ఆషాఢ మాస మొక్కులు తీర్చుకున్నారు. గాజుల గౌరీదేవిగా అలంకృతమైన అమ్మవారికి శుక్రవారం తెల్లవారు జామున ఆలయ అర్చకులు పలు రకాలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

కొబ్బరి మొక్కల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా కొబ్బరి మొక్కలకు అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్.బి.వి.చలపతిరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కొబ్బరి మొక్కల రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ నకళ్లను తీసుకురావాలన్నారు. కేంద్ర పని వేళల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు తెలిపారు. దేశవాళీతో పాటు ఇతర అభివృద్ధి చేసిన వంగడాల మొక్కలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

స్వదేశానికి చేరుకున్న వీరేంద్రకుమార్



సౌదీ అరేబియా నుంచి హైదరాబాద్ చేరుకున్న వీరేంద్రకుమార్ (రెడ్ షర్ట్)

అంబాజీపేట: ఏజెంట్‌ను నమ్మి ఖతార్‌కు వంట పని కోసం వెళ్లి మోసపోయిన అంబాజీపేట మండలం ఇసుకపూడికి చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ శుక్రవారం సౌదీ అరేబియా నుంచి హైదరాబాద్ చేరుకున్నట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. తనకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో హైదరాబాద్‌లో తన అక్క ఇంటి వద్ద ఉండి వైద్య పరీక్షలు చేయించుకుని ఆదివారం వీరేంద్ర తన స్వగ్రామానికి చేరుకుంటారని చెప్పారు.

29న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: స్థానిక వికాస కార్యాలయంలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్ అండ్ కెమిస్ట్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు ఉదయం 9 గంటలకు అభ్యర్థులు హాజరు కావాలని లచ్చారావు పేర్కొన్నారు.

తలుపులమ్మకు రేపు లక్ష పుష్పార్చన

తుని రూరల్: ఆషాఢ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా ఈ నెల 28న తలుపులమ్మ అమ్మవారికి లక్ష పుష్పార్చన చేయనున్నారు. లోవ దేవస్థానం ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు శుక్రవారం ఈ విషయం తెలిపారు. అమ్మవారితో పాటు ఆలయాన్ని అలంకరిస్తామన్నారు.

ఒలింపిక్స్ మెడల్.. నా కల



- గెలిచేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా
- చిరాగ్‌శెట్టితో సమన్వయం కుదిరింది
- టోక్యో ఒలింపిక్స్ తర్వాత ఎన్నో విజయాలు సాధించాం
- ఈసారి మరింత పట్టుదలతో ఆడుతా
- 'సాక్షి'తో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్

సాక్షి, అమలాపురం: ఆరు అడుగుల 'రాకెట్'.. సాత్విక్ సాయిరాజ్. అతని షటిల్ స్మాష్.. బుల్లెట్ వేగం. ప్రపంచ వేదికలపై వరుస విజయాలతో రికార్డులు సృష్టిస్తూ.. భారత్‌కు బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఎన్నో విజయాలను అందించిన ఈ గోదావరి కుర్రాడు.. ఇప్పుడు 'పారిస్' చేరాడు. తన చిన్ననాటి కల అయిన 'ఒలింపిక్స్ మెడల్'ను సాకారం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ..

టోక్యో ఓటమి తర్వాత రికార్డు విజయాలే..

మొట్టమొదటిసారిగా టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నా. అప్పుడు చాలా సంతోషించా. రెండు లీగ్ మ్యాచ్‌లు గెలిచినా.. పాయింట్ల సాధనలో వెనుకబడడంతో నాకౌట్‌కు చేరుకోలేకపోయాం. ఆ టోర్నీలో గోల్డ్ మెడల్ సాధించిన జోడీని.. మొదట లీగ్ మ్యాచ్‌లోనే 2-1 తేడాతో మేము ఓడించాం. నాకౌట్‌కు వెళ్లి ఉంటే కచ్చితంగా పతకం సాధించే వాళ్లం. 2021 టోక్యో ఒలింపిక్స్ తర్వాత చిరాగ్ శెట్టి, నేను కలిసి థామస్‌కప్, కామన్‌వెల్త్, ఆసియా క్రీడల్లో విజయాలను సాధించాం. భారత బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో రికార్డులు నెలకొల్పాం. వరల్డ్ నంబర్‌వన్ స్థానాన్ని చేరుకున్నాం. ఆ విజయాలే ఇప్పుడు మా ఇద్దరికీ ఉత్ప్రేరకాలు.

మా జోడీ సూపర్‌హిట్..

చిరాగ్‌శెట్టితో కలిసి ఆడటం మొదలు పెట్టినప్పటి నుంచి అద్భుతమైన విజయాలు సాధించా. మా జోడీ సూపర్ హిట్ అయ్యింది. మా మధ్య మంచి సమన్వయం ఉంది. అందుకే అసాధ్యమనుకున్న విజయాలు కూడా సాధిస్తున్నాం. నేషనల్ చీఫ్ కోచ్ గోపీచంద్ సహకారం మెండుగా ఉంది. డబుల్ స్పెషలిస్ట్ కోచ్ మిథియాస్ బో(డెన్మార్క్) మంచి శిక్షణ ఇస్తున్నారు. ఆయన శిక్షణలోనే ఏషియన్ గేమ్స్ టీం చాంపియన్‌షిప్ రన్నర్స్, డబుల్స్‌లో మొట్టమొదటిసారిగా గోల్డ్ మెడల్ సాధించాం. ఈసారి ఒలింపిక్స్ లీగ్ దశలో డ్రా కూడా అనుకూలంగా వచ్చింది. అలాగే సహ క్రీడాకారులు ప్రణయ్, లక్ష్యసేన్, సింధు, పొన్నప్పలకు కూడా మంచి డ్రా లభించింది. మేమంతా మంచి ప్రతిభ చూపి భారత్‌కు పతకాలు సాధించేందుకు కృషి చేస్తాం.

ఒత్తిడిని అధిగమిస్తా..

ప్రతి క్రీడాకారుడికి ఒత్తిడి ఉంటుంది. అందులోనూ అత్యున్నత క్రీడా వేదిక అయిన ఒలింపిక్స్‌లో ఆడినప్పుడు సహజంగా ఒత్తిడికి గురవుతాం. మా ప్రత్యర్థులకు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. దానిని అధిగమిస్తామనే నమ్మకం మాకుంది. అంతిమంగా ఆ రోజు ఆట తీరును బట్టి ఫలితం ఉంటుందని నా నమ్మకం. పారిస్ ఒలింపిక్స్ లక్ష్యంగా ఎప్పటి నుంచో సాధన చేస్తున్నాం.

పతకం అవకాశాలు పుష్కలం

ప్రతి క్రీడాకారుడి అంతిమ లక్ష్యం ఒలింపిక్స్ ఆడమే. దీని కోసం నాలుగేళ్ల పాటు కఠోర సాధన చేస్తారు. ఆశించిన ఫలితం వచ్చినప్పుడు (పతకం సాధించినప్పుడు) ఇవన్నీ మరిచి పోతాం. నేను కూడా అంతే. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ మ్యాచ్ రోజు మేము చూపించే ప్రతిభ మీదే జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. దేశ, రాష్ట్ర ప్రజలతో పాటు ముఖ్యంగా గోదావరి జిల్లాల వాసుల ఆశీస్సులు ఎప్పుడూ మా వెంట ఉంటాయని ఆశిస్తున్నా. తల్లిదండ్రులు రంగమణి, కాశీ విశ్వనాథం, బంధువులు, మిత్రులు, అభిమానులు అందించే ప్రోత్సాహంతో ఒలింపిక్స్ పతకాన్ని సాధిస్తా. నా కల నెరవేర్చుకుంటా.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సాత్విక్



ప్రధాని నరేంద్ర మోదీతో సాత్విక్

రికార్డులు.. పతకాలు.. అవార్డులు

టోక్యో ఒలింపిక్స్ నిరాశ పరిచినా ఆ వెంటనే సాత్విక్, చిరాగ్ జోడీ థామస్ కప్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత ఆసియా కప్ డబుల్స్‌లో బంగారు పతకం, టీమ్ ఈవెంట్‌లో రజత పతకం గెలిచారు. వీటితో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్, కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్, చైనా మాస్టర్స్, మలేసియన్ ఓపెన్, థాయిలాండ్, ఫ్రెంచ్ ఓపెన్ వంటి అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు అందుకున్నారు. 2023 అక్టోబర్ 10న ప్రపంచ డబుల్స్ విభాగంలో తొలిసారి నంబర్ వన్ ర్యాంకు సాధించిన ఈ జోడీ.. ఇప్పుడు కూడా అదే ర్యాంకులో కొనసాగుతున్నారు. అలాగే సాత్విక్ 565 కి.మీ.ల వేగంతో షటిల్ స్మాష్ ఆడి.. గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కాడు. 2020లో అర్జున్ అవార్డు, ఈ ఏడాది ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును సాత్విక్ అందుకున్నాడు.



సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి

'శిక్షా సప్తాహ్'తో బోధనా నిబద్ధత

- విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి
- సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదనరావు



విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న మధుసూదనరావు, అధికారులు

అమలాపురం టౌన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంతో ఉపాధ్యాయుల్లో బోధనా నిబద్ధత పెరుగుతుందని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదనరావు అన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ జరుగుతున్న ఈ శిక్షా సప్తాహ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు భాగస్వామ్యం కావాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో మధుసూదనరావు శుక్రవారం పాల్గొని నైపుణ్య శిక్షణలో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల నైపుణ్య ప్రదర్శనలను తిలకించి అభినందించారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధత వెలికితీయడమే శిక్షా సప్తాహ్ ముఖ్య ఉద్దేశమని మధుసూదనరావు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28 వరకూ జరుగుతున్న ఈ కార్యక్రమంలో రోజు వారీ ప్రణాళికను ఉపాధ్యాయులు ఎలా అమలు చేస్తున్నదీ ఆయన పరిశీలించారు. డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం, సమగ్ర శిక్ష ఏపీవో ఎంపీకే భీమారావు, ఏఎల్ఎస్ఓ రమేష్, కోర్స్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, సీఆర్పీ మెండి శ్రీనుబాబు పాల్గొన్నారు.

మడ అడవులు అద్భుతం

- కోరంగి అభయారణ్యంలో 'ద వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'
- ఆసక్తిగా తిలకించిన రాజేంద్రసింగ్
- అమితానందంతో గోదావరి పాయలో బోటు షికారు



కోరంగి అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్ తదితరులు

తాళ్లరేవు: నీటి పరిరక్షకుడు, తరుణ్ భారత్ సంఘ్ వ్యవస్థాపకుడు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకొనే డాక్టర్ రాజేంద్రసింగ్ శుక్రవారం కోరంగి అభయారణ్యంలో సందడి చేశారు. ప్రపంచ మడ అడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మడ అటవీ ప్రాంతాన్ని ఆయన ఆసక్తిగా తిలకించారు. గోదావరి పాయలో బోటు షికారు చేసి అమితానందం పొందారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ కోసం మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులు ప్రకృతి, పర్యావరణం, పంచభూతాల పట్ల ప్రేమభావంతో ఉండి వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. మడ అడవుల్లో ప్లాస్టిక్‌నూ సమూలంగా నిషేధించడంతోపాటు సొంత ఆస్తిలాగా కాపాడుతున్న అటవీ అధికారులను రాజేంద్రసింగ్ అభినందించారు. పర్యావరణ పరిరక్షకుడు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో జన్మించిన రాజేంద్రసింగ్ ఆయన రాష్ట్రంలో అంతరించిపోయిన ఐదు నదులకు జీవం పోసి వెయ్యి గ్రామాలకు నీరందించారన్నారు. నీటి నిర్వహణలో చేసిన కృషికిగానూ 2001లో రామన్ మెగసెసే పురస్కారాన్ని అందుకున్నారని కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అడవుల సంరక్షించడంతపాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో అనేక మంది కీలకపాత్ర పోషించారన్నారు. మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి ఆలపించిన గీతం అందరినీ అలరించింది. అనంతరం కోరింగా మాంగ్రూవ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మడ అడవులపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షకులు మృత్యుంజయ రావు, రత్నం, సబ్ డీఎఫ్ఓ టి.అనూష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాదరావు, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు టి.సత్యనారాయణ, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం స్టాక్ యార్డులో

లోడింగ్ చార్జీ రూ.20 పెంపు

కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కపిలేశ్వరపురం స్టాక్ యార్డులో లోడింగ్ చార్జీ రూ.20 అదనంగా పెంచామని జిల్లా ఇసుక కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రకటించారు. ప్రస్తుత ఉచిత ఇసుక విధానంలో ఒక్క మెట్రిక్ టన్నుకు రూ.245లు వసూలు చేస్తున్నారని కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ యార్డ్ రోడ్డుకు దిగువన లోతుగా మట్టి ఉండడంతో ప్రతిరోజు కొబ్బరి ఆకులతో దారి వేయడం మూలంగా లోడింగ్ చార్జి 20 రూపాయలు పెంచడానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆమోదముద్ర వేసిందని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆరు స్టాక్ యార్డులలో ఇసుక పరిమాణం సరఫరా ఆన్‌లైన్ డీజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహణ, అదనపు చార్జీల వసూలు చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై విచారణ డిజిటలైజేషన్ పాయింట్ల ఎంపిక, ఒక వ్యక్తికి ఆధార్ కార్డుపై రోజువారి 20 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తికి ఆధార్‌కార్డు పై రోజువారి కేవలం 20 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుకను సరఫరా చేయాలని ఆదేశించారు. నూతనంగా 21 డీ సిల్టేషన్ పాయింట్లను ఎంపిక చేశామని, వీటికి అనువైన స్టాక్ యార్డ్‌లను ఎంపిక చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవోలు జి.కేశవవర్ధన్‌రెడ్డి, ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారి సాయిరాం సింగ్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ సందీప్‌రెడ్డి, గోదావరి హెడ్‌వర్క్స్' ఈ ఈ కే కాశీ విశ్వేశ్వరరావు, డీపీవో రాంబాబు, డీటీవో అశోక్ ప్రతాప్ రావు ఆర్ అండ్ బీ ఎస్ఈ బి.రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన వరద

- వ్యవసాయ, ఉద్యాన పంటలు, పాడి, ఆక్వాకు పెరుగుతున్న నష్టం
- అరకొరగా ప్రభుత్వ సాయం



అప్పనపల్లి కాజ్ వే పై ప్రవహిస్తున్న వరద నీరు



సఖినేటిపల్లి లాకుపేటలో ఇళ్ల వద్దకు చేరిన వరద నీరు

సాక్షి అమలాపురం: గోదావరికి ఈ నెల 19న వరద పోటు మొదలైంది... అదే రోజు నుంచి గోదావరి మధ్యనున్న లంక గ్రామాలకు బాహ్య ప్రపంచాలతో సంబంధాలు తెగిపోయాయి. ఎగువన వరద తగ్గుముఖం పట్టినా కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో వరద ముంపు వీడడం లేదు. గురువారం ఉదయం నుంచి వరద స్వల్పంగా తగ్గుతోంది. అయినా ఇప్పటికీ ఇళ్ల చుట్టూ ముంపు నీరు వీడడం లేదు. కాజ్‌వేల మీద నీరు ఉండడంతో పలు గ్రామాల వారు పడవల మీదనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

కూలిపోతున్న ఇళ్లు

జిల్లాలో ఈ నెల 22వ తేదీ నుంచి లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. అప్పటి నుంచి పలు లంక గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 12.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో వరద 12 మండలాలపై ప్రత్యక్ష ప్రభావం చూపించింది. 34 గ్రామాలు వరద బారిన పడ్డాయి. వీటిలో 37 శివారు గ్రామాలు నీట మునిగాయి. 293 కుటుంబాలకు చెందిన 809 మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. వరద ముంపు తగ్గకపోవడం వల్ల పూరిపాకలు, మట్టి ఇళ్లు నీట నాని కూలిపోతున్నాయి. ఇప్పటి వరకు 13 ఇళ్లు దెబ్బతిన్నాయి. అయినవిల్లి మండలం అయినవిల్లి లంకలో ఒకరు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, కె.గంగవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో లంక గ్రామాలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి.

వరద ఉధృతి వల్ల పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతోంది. గోదావరిలో వరద అధికంగా ఉండడం వల్ల మురుగునీటి కాలువల్లో నీరు అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల ద్వారా నదీపాయల్లోకి దిగడం లేదు. డ్రెయిన్లు గట్లు దాటి ప్రవహించే ప్రమాదం నెలకొంది. దీనివల్ల చేలల్లో వారం రోజులుగా ముంపు నీరు ఉండిపోవడంతో కుళ్లిపోతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు అంచనా ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు వరకు నాట్లు వేసిన 3,388.3 ఎకరాల్లో పంట దెబ్బతింది. 762.95 ఎకరాల్లో పంట పూర్తిగా నష్టపోయారు. నారుమడుల విషయానికి వస్తే 281.65 ఎకరాలు ముంపు బారిన పడగా, దీనిలో 193.75 ఎకరాల్లో నారు పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ మరోసారి విత్తనాలు జల్లే అవకాశం లేదు. నష్ట తీవ్రత అధికంగా ఉంటుందని అంచనా. ఉద్యాన పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. మొత్తం జిల్లాలో 5,030 మంది రైతులకు చెందిన 3,943.30 ఎకరాల్లో అరటి, కంద, పువ్వులు, పసుపు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి.

పశు గ్రాసానికి ఇబ్బంది

లంక గ్రామాల్లో పాడి రైతులు అధికంగా నష్టపోతున్నారు. పశువులకు అవసరమైన పచ్చిమేత వరద నీట మునిగింది. ఎండుగడ్డి కొట్టుకుపోయింది. ప్రభుత్వం నిబంధనల పేరుతో ఎండు గడ్డి సరఫరా చేయడం లేదు. దీనితో లంక పశువులు ఆకలితో నకనకలాడుతున్నాయి. లంక వాసులు పాడిని తరలించేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారు. పడవల మీద రాకపోలు చేయాల్సి రావడం కష్టంగా ఉందని చెబుతున్నారు. వరదలకు ఇతర జీవాలకు నష్టం వాటిల్లింది. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 23 గొర్రెలు చనిపోగా రూ.81 వేలు నష్టపోయారని అంచనా. ఏటిగట్టు దిగువన నదిని ఆనుకుని అనధికార సాగు చేసే ఆక్వా రైతులు సైతం భారీగా నష్టాలను మూటగట్టుకున్నారు. కౌంట్‌తో సంబంధం లేకుండా పట్టుబడులు చేసి అయినకాడకు అమ్ముకున్నారు.

నామమాత్రంగా ప్రభుత్వ స్పందన

గోదావరికి వరద పోటు మొదలై తొమ్మిది రోజులు కావస్తోంది. ఇదే సమయంలో రెండు, మూడు రోజులు అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు జిల్లాలోని లంక గ్రామాలతో పాటు జిల్లాలోని పి.గన్నవరం మండలాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో లంక గ్రామాలకు పడవల మీద రాకపోకలు చేయాల్సి ఉంది. కనకాయిలంక, అప్పనపల్లి, ఎదురుబడియం కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో పడవలే శరణ్యం. అయినా ప్రభుత్వం నుంచి స్పందన నామమాత్రంగా ఉంది. అరకొర సాయం మాత్రమే అందుతోంది. రెండవ ప్రమాద హెచ్చరికతో వరద ఆగిపోయిందని ఒక ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని మాత్రమే అందుబాటులో ఉంచారు. ఇంతవరకు అల్లవరం మండలం బోడసుకుర్రు, ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంకలో మాత్రమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈరోజు వరకు 2,130 ఫుడ్ ప్యాకెట్లు అందించగా, 1,820 వాటర్ ప్యాకెట్లు, 5,401 వాటర్ క్యాన్స్ అందించినట్టు అధికారులు తెలిపారు. 60 వరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా, 8 కుటుంబాల వారికి కేవలం 10 కేజీల చొప్పున 80 కేజీల బియ్యం మాత్రమే అందించడం గమనార్హం.

పొన్నమండ సర్పంచ్ బేబికుమారి అరెస్ట్

- సర్పంచ్ కుమారుడు తనను మోసగించాడని యువతి ఫిర్యాదు
- రాజకీయ ఒత్తిడితో మూడు నెలలుగా చర్యలు తీసుకోని పోలీసులు
- బాధితురాలి నిరసనతో ఎట్టకేలకు జనసేన నేత అరెస్ట్

రాజోలు: సర్పంచ్ కుమారుడు ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన కేసులో పొన్నమండ సర్పంచ్ కుక్కల బేబికుమారిని శుక్రవారం రాజోలు పోలీసులు అరెస్ట్ చేశారు. సర్పంచ్ చిన్న కుమారుడు స్టాలిన్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసగించాడని అదే గ్రామానికి చెందిన సరెళ్ల తేజస్విని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన వద్ద ఉన్న డబ్బు, బంగారం కాజేశాడని తనను పెళ్లి చేసుకోమని అడిగితే పెళ్లికి ఒప్పుకోకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని పేర్కొంది. తనకు జరిగిన అన్యాయంపై పెద్దల సమక్షంలో ఎన్నిసార్లు అడిగినా పెళ్లికి ఒప్పుకోకుండా సర్పంచ్ హోదాలో కుక్కల బేబికుమారి, ఆమె పెద్ద కుమారుడు కుక్కల లెనిన్, బుంగ అశోక్ తనను బెదిరించారని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై రాజోలు సీఐ గోవిందరాజు కేసు నమోదు చేశారు. సర్పంచ్ చిన్న కుమారుడు స్టాలిన్ పరారీలో ఉన్నాడని, సర్పంచ్ బేబికుమారిని అరెస్ట్ చేసి రాజోలు కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ గోవిందరాజు తెలిపారు. సర్పంచ్ బేబికుమారి గతంలో గ్రామ ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో జనసేన పార్టీలో చేరారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో తేజస్వి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసినా ముద్దాయిలను మూడు నెలల నుంచి అరెస్ట్ చేయకుండా తాత్సారం చేశారు. సర్పంచ్ బేబికుమారితోపాటు ఆమె పెద్ద కుమారుడు లెనిన్ ఆర్ ఎస్సై ఉద్యోగానికి మెడికల్ లీవ్ పెట్టి మరీ పొన్నమండ వచ్చి తనపై తప్పుడు కేసులు పెట్టిస్తానని భయపెట్టాడని తేజస్విని వాపోయింది. తనను మోసం చేసిన స్టాలిన్‌తో తనకు పెళ్లి జరిపించాలని లేకపోతే పోలీసులు నమోదు చేసిన కేసులో ముద్దాయిలను అరెస్ట్ చేయాలని తేజస్విని గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి తన సమస్యను వివరిస్తూ నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి సర్పంచ్ బేబికుమారిని అరెస్ట్ చేశారు.

టీడీపీ దాష్టీకానికి వైఎస్సార్ సీపీ నేత బలి


వీరబాబు అంతిమయాత్రలో పాడె మోసిన దవులూరి దొరబాబు


వేట్లపాలెంలో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ లతాకుమారి


పెద్దాపురం ఏరియా ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా చేసిన దొరబాబు తదితరులు

- సోషల్ మీడియాలో వేధించడంతో ఆత్మహత్య చేసుకున్న వార్డు సభ్యుడు
- పార్టీ చురుకైన వాడిని కోల్పోయిందని పలువురి ఆవేదన
- నియోజకవర్గ కో ఆర్డినేటర్ దొరబాబు ఆధ్వర్యంలో నిరసన
- వేట్లపాలెంలో ఉద్రిక్తత, మృతదేహంతో ఆస్పత్రి వద్ద ధర్నా
- పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ చూపడంతో ఆందోళన విరమణ

సామర్లకోట: టీడీపీ దాష్టీకానికి పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఒక చురుకైన నాయకుడిని కోల్పోయింది. వేట్లపాలెం గ్రామ పంచాయతీ 10వ వార్డు సభ్యుడు బొబ్బిలి వీరవెంకట సత్యనారాయణ(వీరబాబు) (34) శుక్రవారం ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వీరబాబు కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న వేధింపులు, బెదిరింపులతో భయపడేవాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పి మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. సోషల్ మీడియాలో వస్తున్న వేధింపులు వీరబాబు ఆత్మహత్యకు దారి తీస్తాయని భావించలేదని స్నేహితులు, కుటుంబ సభ్యులు అంటున్నారు. అధికార పార్టీకి చెందిన తెలుగుదేశం నాయకుల వేధింపుల కారణంగానే వీరబాబు ఫ్యానుకు ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలు రావడంతో పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో సమాచారం సేకరించారు. కుమారుడు మృతి చెందడంతో తల్లి మంగ, తండ్రి ఎరుకులనాయుడు బంధువులు మృతదేహం వద్ద బోరున విలపించారు. వీరబాబు మృతి చెందిన వార్త తెలిసి అతని బంధువులు, స్నేహితులు తరలి వచ్చారు. దీంతో గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో సీఐ అంకబాబు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తండ్రి ఎరుకులనాయుడు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న వేధింపుల కారణంగా తన కుమారుడు మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోస్టింగ్‌లు పెడుతున్న వారి పెద్దల వద్దకు వెళ్లి ప్రాధేయపడినా ఫలితం కనిపించలేదన్నారు. అన్నదమ్ములకు ఒకే మగ బిడ్డ కావడంతో ఎంతో గారాబంగా పెంచుకున్నామని ఎరుకులనాయుడు బోరున విలపించారు. ఇటువంటి కడుపు కోత మరెవ్వరికీ రాకూడదంటూ తల్లి మంగ రోదించింది.

పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి వద్ద ఉద్రిక్తత

మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి తరలించడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. దాంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రంగా ఉంటుందని పార్టీ నాయకులు హెచ్చరించారు. మృతుని తండ్రి ఎరుకులనాయుడు ఫిర్యాదు మేరకు 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ లతాకుమారి చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులతో కలిసి దవులూరి దొరబాబు, పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకుల వేధింపుల కారణంగా వీరవెంకటసత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. వేధింపులకు గురి చేసిన నాయకులు, కార్యకర్తలు గ్రామంలోనే తిరుగుతున్నారని వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో చురుకైన పార్టీ నాయకుడిని కొల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ అనంతరం నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పిన పోలీసులు, 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని అందజేయడంతో పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. అనంతరం వీరబాబు అంత్యక్రియలు వేట్లపాలెంలో నిర్వహించారు. అంతిమయాత్రలో వీరబాబు పాడెను దవులూరు దొరబాబు మోశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఆంధ్రమాల మహానాడు నాయకులు లింగం శివకుమార్, బీపెల్లి పండు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వేధిస్తున్నారనే చెప్పేవాడు



కొంత కాలంగా నా సోదరుడు వీరవెంకటసత్యనారాయణ మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. కారణం అడిగితే గ్రామానికి చెందిన కొంతమంది తెలుగుదేశం నాయకులు సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టింగ్‌లు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని బాధపడేవాడు. అయితే ఆ ఫొటోలు చూపమంటే చూపలేదు.

– దేవి, మృతుని సోదరి, వేట్లపాలెం

గ్రామం వదలి వెళ్లమన్నాం



టీడీపీ నాయకులు వేధింపులకు భయపడటంతో నా బావమరిది అయిన వీరవెంకట సత్యనారాయణను గ్రామం విడిచి బంధువులు ఉన్న విశాఖ పట్నం వెళ్లాలని సూచించాం. సరే అని అంగీకరించిన రెండు రోజులకే ఆత్మహత్య చేసుకున్నాడు.

– కర్రి సతీష్‌కుమార్, వేట్లపాలెం

10 కాసుల బంగారం, నగదు అపహరణ

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామంలో ఒక ఇంటిలో బీరువాలు తెరిచి 10కాసుల బంగారం, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.జగ్గంపేట ఇన్ చార్జి ఎస్ఐ బలరాం కథనం ప్రకారం సిదిరి శివదుర్గ బొడ్డువారి వీధిలో నివసిస్తున్నాడు. గురువారం తన బంధువు జగ్గంపేటలో మృతి చెందాడని తెలియడంతో హడావుడిగా ఇంటికి గడియవేసి బయలుదేరాడు. ఇంటికి తన తల్లి తాళం వేస్తుందని భావించాడు. అయితే అతని తల్లి, తండ్రి కూడా ఇంటికి తాళం వేయకుండా జగ్గంపేట వచ్చేశారు. జగ్గంపేటలో కార్యక్రమాలు ముగించుకుని శివదుర్గ చేరుకునే సరికి ఇంట్లో బీరువాలు తెరిచి వుండడం, చోరీ అయిన సంగతి గమనించి శుక్రవారం జగ్గంపేటలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ అల్యూమినాటర్ సౌజన్యంతో
DSC School Asst. Social
కోచింగ్ ప్రారంభం 30-7-24 ఉ. 9 గంటలకు
అడ్మిషన్లు జరుగుచున్నవి
SATYAM STUDY CIRCLE Near More Stores, రామారావుపేట, కాకినాడ. 9849238377 9948645434

పట్టపగలే చోరీ

రూ.3 లక్షల నగదు, 20 కాసుల బంగారం వస్తువుల మాయం


ప్రత్తిపాడులో చోరీ జరిగిన ఇంటిలో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు


ప్రత్తిపాడులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో పట్టపగలే చోరీ జరిగింది. ఓ పక్క ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు దర్జాగా ఇంటిలోకి ప్రవేశించిన అగంతకులు తాళాలు తెరుచుకుని, చోరీకి పాల్పడ్డారు. బీరువా, అల్మారా తలుపులు తెరిచి, వాటిలో ఉన్న రూ.3 లక్షల నగదు, 20 కాసుల బంగారం వస్తువులను దోచుకుని ఉడాయించారు. బాధితుల, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ముచ్చకర్ల అప్పలస్వామి దేవీపట్నం మండలం ఇందుకూరిపేట పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నాడు. ఇతను కుటుంబంతో సహా స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపాన గల తన స్వంత ఇంటిలో నివసిస్తున్నాడు. గురువారం ఉదయం అప్పలస్వామి విధుల నిర్వహణకు వెళ్లాడు. అనంతరం అతని భార్య సూర్యకాంత ఇంటి తలుపులకు తాళం వేసి, స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తమ మామగారు చిట్టిబాబు నిర్వహిస్తున్న పాన్‌షాపు వద్దకు అతనికి సాయంగా ఉండేందుకు వెళ్లింది. ఇంటి మెయిన్ డోర్ తాళం మాత్రం బయట కిటికీలో ఉంచింది. ఇది రోజూ జరిగే తంతు. ఇంటి పైభాగంలో తాపీ పనులు చేయిస్తున్నారు. కూలీలంతా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన అప్పలస్వామి యథావిధిగా మెయిన్‌డోర్ తాళం తీసుకుని, లోపలికి వెళ్లగా చోరీ జరిగినట్టు గుర్తించాడు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడిన అగంతకులు కిటికీలో ఉన్న తాళంతో మెయిన్‌డోర్ తెరిచి, లోనికి చొరబడ్డారు. ఇంటిలో కప్‌బోర్డులో ఉన్న బీరువా తాళాలతో బెడ్‌రూంలోని బీరువా, కబ్ బోర్డులను తెరిచారు. వాటిలో ఉన్న రూ.3 లక్షల నగదు, బంగారు చెవిదుద్దులు, గొలుసు, బ్రాస్‌లెట్, నల్లపూసల దండ, చెవి రింగులు తదితర 20 కాసుల బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. ఇంటి వెనుక తలుపులు తెరుకుని పరారయ్యారు. అయితే మెయిన్‌డోర్‌కు తాళం వేసి, తాళం చెవులను యథాతథంగా బయట కిటికీలో పెట్టి ఉడాయించారు. రాత్రి వచ్చిన డాగ్ స్క్వాడ్ గ్రామం శివారు కొండ మలుపు నుంచి పుంత మార్గం గుండా జాతీయ రహదారి వరకు వెళ్లింది. ఉదయం నుంచీ క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తోంది. ప్రత్తిపాడు సీఐ ఎం. శేఖర్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కత్తితో దాడి

పిఠాపురం: పాత గొడవల నేపథ్యంలో ఓ మహిళపై ఒక వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన వేమగిరి రాజేష్ అలియాస్ సతీష్‌కు, అదే గ్రామానికి చెందిన నేకూరి రాజ్యలక్ష్మికి మధ్య పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఇద్దరి మధ్య చిన్న వివాదం మొదలై, చినికి చినికి గాలివానగా మారింది. ఈ క్రమంలో రాజేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజ్యలక్ష్మిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. కత్తిపోట్లతో ఆమె శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను పోలీసులు తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై గొల్లప్రోలు ఎస్సై జానీ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు గతంలో అతని మేనమామ ద్రాక్షారపు భూషణంపై దాడి చేసినట్టు కేసు నమోదు అయిందని, అతడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING FOR SALE
D.No. 4-23-3, Sivaji Street, Alcott Gardens, Rajahmundry. South Facing 211 Sq.yds Building for sale. Ph: 7981320189 [V- 2636]

Services

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో/ ముత్తూట్ మనప్పురం ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. ✆ : 98491 38626 [R-1229031]

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2549]

Wanted

రాజమండ్రి ఎ.వి.అప్పారావు రోడ్డు, దివాన్ చెరువులలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం 12,500, 14,500, 10th పాస్ or ఫెయిల్, వయసు 50 లోపు ✆ : 97057 67888, 96522 44848 [R-1980]

రాజు న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఫార్మసిస్ట్ మరియు రిసెప్షనిస్టు కావలెను. సంప్రదించండి. ✆ : 98853 96111 [R-6701]

Foton Decors కంపెనీ నందు పనిచేయుటకు Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్ర॥ 88826 56789 [R-1229029]

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన కంపెనీలో Team Leaders అమలాపురం మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q:10th above. పావని. 93917 77964 [R-1229063]

కావలెను
ఆదిత్య యూనివర్సిటీ
సూరంపాలెంలో పనిచేయుటకు బస్సుడ్రైవర్లు కావలెను.
స్కూలు బస్సు డ్రైవింగ్‌లో అర్హత, అనుభవం కలిగిన డ్రైవర్లు.
కాకినాడ,రాజమండ్రి,దాగల్లు,కొవ్వూరు, సీతానగరం, యానాం, రావులపాలెం, రామచంద్రాపురం, జగ్గంపేట, గోకవరం, మండపేట,కత్తిపూడి,అన్నవరం,ఉప్పాడ తదితర ప్రాంతాల నుండి విద్యార్థులను తీసుకుని వచ్చుటకు...
ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం.
99518 96665, 76598 76668

కాకినాడ ఆటోనగర్ హోండా టూ వీలర్స్ విభాగంలో పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం : 15,000/- Contact ✆ : 94909 98888 [R-47]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185270]

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను ,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజ నం. జీతం:17K.ఫోన్ 8520980099, 8520874499 [H-796258]

రెయిన్‌బో కం॥లో బుక్స్ మార్కెటింగ్ చేయుటకు కావలెను. Qly: 10th, ఇంటర్, డిగ్రీ. కమీషన్ మాత్రమే ఇవ్వబడును. 2 వీలర్ కంపల్సరీ. సంప్ర: 9398981980 [H-778840]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406 [HA-412]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185366]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వెండి ఆభరణాల రికవరీ


విలేకరులతో మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలు

- నిందితుడి అరెస్ట్
- కాకినాడ డీఎస్పీ హనుమంతరావు వెల్లడి


నిందితుడు రాములు నాయక్

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఈ నెల 5వ తేదీన ఆలయంలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి వెండి ఆభరణాలు రికవరీ చేశామని కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ జి.మామిడాడ గ్రామ శివారు సూర్యనారాయణపురంలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో సుమారు 14కేజీల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనిపై అప్పటి ఎస్సై శోభన్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలిలోని సీసీ కెమెరా, క్లూస్‌టీమ్, వేలి ముద్రలు, డాగ్ స్క్వాడ్ సాయంతో నిందితుడిని గుర్తించారు. సికింద్రాబాద్ తుకారం గేట్ వద్ద ఉండే అముగోతు రాములు నాయక్‌ను కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద గురువారం అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అతని వద్ద నుంచి 14 కిలోల వెండి ఆభరణాలు కవచాలు, హరాండీ, ఉత్సవ విగ్రహాల మంగళసూత్రాలు రికవరీ చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 15 పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయి ఉన్నాయన్నారు. పలుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు దేవుని ఆలయాల్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీలు చేస్తున్నాడన్నారు. ఈ కేసులో త్వరగా నిందితుడిని పట్టుకోడానికి కృషి చేసిన పోలీసులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందనలు తెలిపారన్నారు. దేవాలయాల్లో సీసీ కెమెరాలు లేకపోతే వెంటనే అమర్చుకోవాలన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ ఏ సన్యాసిరావు, క్రైమ్ సీఐ వై.చిట్టిబాబు, ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై వి.శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో జరిగిన హత్య కేసులో నలుగురికి అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శ్రీలత యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారని ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర విలేకరులకు తెలిపారు. యనమదల గ్రామానికి చెందిన దారా అప్పారావుకు చెందిన పాడి గేదెలు అదే గ్రామానికి చెందిన సాదే జనార్దనరావు భూమిలోకి వెళ్లి అతను పెంచుకుంటున్న మొక్కలను తిని పాడు చేసిన విషయమై ఇరువురికీ గొడవలు జరిగాయి. ఈ క్రమంలో 2015 సెప్టెంబర్ 6న మధ్యాహ్నం 2 గంటల సమయంలో సాదే జనార్దనరావు భూమిలోకి దారా అప్పారావు, అతని ముగ్గురు కుమారులు దారా సింహాద్రి, దారా చంటి, దారా రాజశేఖర్ కత్తులతో, కర్రలతో వచ్చి భూ సరిహద్దులో ఉన్న కర్రల దడిని పాడు చేసి చింతచెట్టును పాడు చేస్తుండగా సాదే జనార్దనరావు, అతని కుమారులు అడ్డగించి దౌర్జన్యం విషయమై నిలదీస్తుండగా దారా సింహాద్రి సాదే జనార్దనరావు మెడ వెనుక నరకడంతో అక్కడికక్కడే రక్తపు మడుగులో అతడు చనిపోయాడు. జరిగిన హత్యపై మృతుని రెండో కుమారుడు సాదే దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్రాక్షారామ ఎస్సై కె.వంశీధర్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ పి.కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. నిందితులు దారా అప్పారావు, దారా సింహాద్రి, దారా చంటి, దారా రాజశేఖర్‌లను అరెస్ట్ చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. రాజమహేంద్రవరం అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కం ఎస్సీ, ఎస్టీ కోర్టులో కేసు విచారణ జరుపగా పీపీ జి.వెంకటరత్నం ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి శ్రీలత తన తీర్పును వెలువరించారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన అప్పటి ఎస్సై దివంగత కె.వంశీధర్, సీఐ పి.కాశీవిశ్వనాథం, విచారణకు కృషి చేసిన ప్రస్తుత ఎస్సై గెల్లా సురేంద్ర, సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉండాలి

సామర్లకోట: గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉండేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు సుస్థిర లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. మూడో బ్యాచ్‌కు రెండో రోజు శిక్షణలో భాగంగా శుక్రవారం నీటి సమృద్ధి గ్రామాల తయారీకి చేపట్టాల్సిన ప్రణాళికను వివరించారు. తాగు, సాగునీటితో పాటు పరిశ్రమలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఫ్యాకల్టీలు వి.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, చక్రపాణిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి హరి శిక్షణ ఇచ్చారు. 11 జిల్లాల్లోని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు శిక్షణ పొందారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)
#30-15-141, 2వ అంతస్తు, పవన్ కమర్షియల్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-20. ☎ 0891-2724155

స్థిరాస్తి అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 (1) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి ఋణగ్రహీత: శ్రీమతి వానంశెట్టి గౌరీ కామేశ్వరి, భర్త: వి. కామేశ్వరరావు మరియు హామీదారు: శ్రీ మద్ది శ్రీనివాసరావు, తండ్రి: ఎమ్. నూకరాజు వారు తేది 20.07.2024 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.1,04,84,187.74 (అక్షరాల ఒక కోటి నాలుగు లక్షల ఎనభై నాలుగు వేల నూట ఎనభై ఏడు రూపాయలు మరియు డెబ్బై నాలుగు పైసలు) + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 13.08.2024 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 13.08.2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపులతో)

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీయవలెను లేదా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ బ్రాంచ్ వారి ఖాతా నెం.209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0003395 కు తేది: 12.08.2024, సా॥ 4.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
శ్రీమతి వానంశెట్టి గౌరీ కామేశ్వరి పేరునగల ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ ఎస్ఆర్‌ఓ, టిడిగ గ్రామం-533006, ఎస్.నెం. 7/1, డి.నెం. 1-348 కలిగిన 225 చ॥గ॥ లేదా 188-12 చ॥మీ॥ ఇంటి స్థలం మరియు అందులోని రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు: తూర్పు: 62.06 అ॥ లేదా 19.05 మీ॥ - గీసాల సత్యనారాయణ భూమిని ఆనుకొని ఒక గజం వెడల్పు రోడ్డు, పడమర: 60.00 అ॥ లేదా 18.20 మీ॥ - పితాని సూర్యారావు యొక్క స్థలం, ఉత్తరం: 30.00 అ॥ లేదా 09.14 మీ॥ - పితాని సూర్య కృష్ణ యొక్క స్థలం, దక్షిణం: 36.00 అ॥ లేదా 10.92 మీ॥ - పంచాయితీ వీధి. ఈ పై హద్దులలో గల 225 చ॥గ॥ లేదా 188-12 చ॥మీ॥ అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు.

రిజర్వు ధర: రూ. 43,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.4,30,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, విశాఖపట్నం ఎఆర్ఎమ్‌బి, ఛీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8332956773, 9000505509. ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.

తేది: 23.07.2024, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)
#30-15-141, 2వ అంతస్తు, పవన్ కమర్షియల్ కాంప్లెక్స్, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-20. ☎ 0891-2724155

స్థిరాస్తి అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9 (1) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి ఋణగ్రహీత: M/s. వినాయక ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రయిటర్: చిట్టూరి కోటేశ్వర రావు మరియు హామీదారు: శ్రీ పాలకూరి సత్యానంద మూర్తి, తండ్రి: వెంకట రాజు వారు తేది 20.07.2024 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.42,45,451.21/- (అక్షరాల నలభై రెండు లక్షల నలభై ఐదు వేల నాలుగు వందల యాభై ఒక్క రూపాయలు మరియు ఇరవై ఒక్క పైసలు) + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 13.08.2024 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 13.08.2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపులతో)

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీయవలెను లేదా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ బ్రాంచ్ వారి ఖాతా నెం.209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0003395 కు తేది: 12.08.2024, సా॥ 4.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3673/2013, తేది: 16.11.2013న కొనుగోలు చేసిన చిట్టూరి కోటేశ్వర రావు పేరున గల ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా-533005, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం ఎస్ఆర్‌ఓ, సర్పవరం గ్రామపంచాయతీ మరియు గ్రామం, ఎస్.నెం.53/2, ప్లాట్ నెం.19 లోని చిట్టూరి కోటేశ్వరరావు పేరునగల 136 చ॥గ॥ లేదా 114.2 చ॥మీ॥ స్థలంతో అందులోని డి.నెం.2-18/1 గల ఆర్‌సిసి బిల్డింగ్ (గ్రౌండ్ + 2 అంతస్తులు) అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.20 లోని స్థలం - 45.0 అ॥ లేదా 13.70 మీ॥, పడమర: రోడ్డు - 46.0 అ॥ లేదా 14.02 మీ॥, ఉత్తరం: 20 అ॥ వెడల్పు రోడ్డు- 22.0 అ॥ లేదా 9.75 మీ॥, దక్షిణం: ప్లాట్ నెం.1 లోని స్థలం - 32.0 అ॥ లేదా 6.70 మీ॥.

రిజర్వు ధర: రూ. 36,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.3,60,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, విశాఖపట్నం ఎఆర్ఎమ్‌బి, ఛీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8332956773, 9000505509. ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.

తేది: 23.07.2024, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్